
## లియో టాల్‌స్టాయ్

# బాలల కధలు



మంచి పుస్తకం

**L. Tolstoy : Stories for Children**

**బాలల కథలు**
రచన : ***లియో టాల్‌స్టాయ్***


మొదటి రెండు ముద్రణలు : 'రాదుగ ప్రచురణాలయం,' మాస్కో
భారత మొదటి ముద్రణ : బాలసాహితి, 2001
రెండవ ముద్రణ : నవంబరు, 2006
మూడవ ముద్రణ : ఆగస్టు, 2009
నాల్గవ ముద్రణ : జనవరి, 2012
అనువాదం : వుప్పల లక్ష్మణరావు
సంపాదకత్వం : కె. సురేష్

ప్రచురణ :
**మంచి పుస్తకం,** 12-13-452, వీధి నెం. 1, తార్నాక, సికింద్రాబాద్ - 500 017.

ప్రతుల సంఖ్య : 2000

వెల : **రూ. 25/-**

ప్రతులకు :
**మంచి పుస్తకం**
C/o. వాసన్, 12-13-452, వీధి నెం. 1,
తార్నాక, సికింద్రాబాద్ - 500 017.
ఫోను: 94907 46614
email: info@manchipustakam.in
website: www.manchipustakam.in

**జన విజ్ఞాన వేదిక**
జి. మాల్యాద్రి
ప్రచురణల విభాగం
162, విజయలక్ష్మీనగర్, నెల్లూరు - 524 004,
ఫోన్: 94405 03061

---

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, 1-9-1126/బి, అజామాబాద్, హైదరాబాద్-20. ఫోన్: 040-2767 8411

లియో టాల్‌స్టాయ్

# బాలల కథలు

మంచి పుస్తకం





# పిల్లికూన

వాస్య, కాత్య అన్నాచెల్లెళ్ళు. వాళ్ళకి ఓ పిల్లి వుండేది. వసంతకాలంలో పిల్లి ఎక్కడికో పోయింది. పిల్లలిద్దరూ దానికోసం ఇల్లూ వాకిలీ వెతికారు. ఎంత వెతికినా అది కనపడలేదు. ఓనాడు వాళ్లిద్దరూ ధాన్యపుకొట్టు దగ్గర ఆడుకుంటూండగా పైనుంచి సన్నటి గొంతుకతో మ్యావ్ మ్యావ్ అంటూ వినిపించింది. వాస్య ధాన్యపుకొట్టుకి ఆనించి వున్న నిచ్చెన ఎక్కి, చూరుకిందికి పాకాడు. కాత్య కింద నుంచుని పదేపదే అడుగుతోంది "కనిపించిందా? కనింపించిందా?"

చెల్లి ప్రశ్నలకి వాస్య కాసేపయిన తరువాత జవాబు చెప్పాడు: "కనిపించింది! మన పిల్లి... దాని దగ్గర పిల్లికూనలున్నాయి. ఎంత బాగున్నాయో! రా, ఇల్లారా!"




కాత్య ఇంట్లోకి పరుగెత్తి పాలు పట్టుకొచ్చి పిల్లికిచ్చింది.

ఐదు పిల్లి కూనలున్నాయి. అవి తల్లి పడుకున్న ఆ మూలనుండి లేచి ఇటూ అటూ తిరగుతున్నాయి. ఆ ఐదు కూనలలోనూ బూడిదరంగు వొళ్లూ, తెల్లని పంజాలూ వున్న ఓ కూనను వాళ్లిద్దరూ ఎంచుకున్నారు. వాళ్ల అమ్మ ఈ కూనను పిల్లలిద్దరికోసమూ ఇంట్లో వుంచేసి, మిగిలిన వాటిని ఇరుగుపొరుగువాళ్లకు ఇచ్చేసింది. ఈ పిల్లి కూనకు పిల్లలు తిండిపెట్టి సంరక్షణ చేసేవారు. దానితో ఆడుకునేవారు, దానిని పక్కలో పెట్టుకొని నిద్రపోయేవారు.

ఒకరోజు పిల్లలిద్దరూ ఆడుకునేందుకని వీధిలోకెళ్లారు. పిల్లికూనను కూడా వాళ్లతో తీసుకెళ్లారు.

గాలికి రోడ్డుమీద గడ్డిపరకలు ఊగుతుంటే పిల్లికూన వాటితో ఆడుకుంటోంది. దానిని చూసి పిల్లలు సరదాగా గంతులేస్తున్నారు. మరికాస్సేపటికి, రోడ్డు అంచున మొలుస్తూన్న ఆకుకూర మొక్కలు పిల్లల కంటబడ్డాయి. అవి కోసుకోవడం మొదలుపెట్టారు. పిల్లికూన సంగతే మరచిపోయారు.





"హేయ్! హేయ్!" అంటూ ఎవరో బిగ్గరగా వేసిన కేక వాళ్లిద్దరికీ తటాలున వినబడింది. పిల్లలిద్దరూ తలెత్తి చూశారు: వేటాగాడొకడు గుర్రాన్ని స్వారిచేస్తూ దొడుమీద వస్తున్నాడు, అతని ముందు రెండు కుక్కలు పరుగెత్తుతున్నాయి. కుక్కలు రెండూ పిల్లికూనను చూసి దానిని పట్టుకోవాలనుకున్నాయి. కాని తెలివిమాలిన పిల్లికూన అక్కడనుండి పారిపోకుండా వీపు పొటమరించి, కుక్కలకేసి చూస్తూ నుంచుంది. కుక్కల్ని చూడ్డంతోనే కాత్యాకి భయంవేసి కెవ్వున కేకపెట్టి, పరిగెత్తింది. వాస్య కుక్కల్ని చూసీచూడడంతో తన శక్తి అంతటితోనూ పిల్లికూన దగ్గరకు పరుగెత్తాడు.



కుక్కలు పిల్లికూనను పట్టుకోవాలనుకున్నాయి, కాని వాస్య పిల్లికూనమీద చెంగున బోర్లపడి, కుక్కలకు దొరకకుండా దానిని తన పొట్టతో కప్పేశాడు.

వేటగాడు అక్కడకు గుర్రంమీద వేగంగా వచ్చి కుక్కలను అక్కడనుంచి తోలేశాడు. వాస్య పిల్లికూనను ఎత్తుకుని దానిని ఇంటికి తీసుకెళ్లాడు. తనతో ఆడుకుందుకు వాస్య ఆనాటినుంచి దానిని వీధిలోకి తీసుకురాలేదు.

# చిన్నపిల్ల, కుక్కగొడుగులు

ఆడపిల్లలు ఇద్దరు కుక్కగొడుగులు ఏరుకుని ఇంటికి వెళుతున్నారు.

దారిలో రైలుకట్టను దాటాలి.

రైలు ఇంకా ఎంతో దూరంలో వుందనుకుని గట్టు ఎక్కి రైలు పట్టాలు దాటుతున్నారు. ఉన్నట్టుండి రైలు మోత వినిపించింది. అక్క చప్పున వెనక్కి పరిగెత్తింది. చెల్లి రైలుకట్ట దాటేసింది.

చెల్లిని చూసి అక్క కేకవేసింది:

“వెనక్కి రాకు, అక్కడే వుండిపో!”

కాని రైలు మోతకి ఆ కేక చెల్లికి వినబడలేదు. అక్క తనను వెనక్కి రమ్మంటోందని వెనక్కి పరుగెత్తింది. పరుగెత్తడంలో తొట్రుకుని కుక్కగొడుగులన్నీ కింద పడిపోయాయి. వాటిని ఏరుకుందుకని పట్టాలమధ్య ఆగిపోయింది.



అప్పటికే రైలు బాగా దగ్గరకొచ్చేసింది. పూర్తి శక్తితో ఇంజనుచేత కూతపెట్టించాడు డ్రైవరు.

అక్క గట్టిగా అరిచింది: “కుక్క గొడుగుల్ని అక్కడ పారేయ్!” కాని, కుక్కగొడుగుల్ని ఏరుకోమని అక్క చెబుతోందనుకుని, ఆ చిన్నపిల్ల వాటిని ఏరుకుందుకు పట్టాలమధ్య పాకుతోంది.

డ్రైవరు రైలుని ఆపలేకపోయాడు. ఇంజను తన శక్తి అంతటితోనూ కూతపెట్టి, ఆ పిల్ల మీదనుంచి వెళ్లిపోయింది.


అక్క కెవ్వున కేకపెట్టింది, మొర్రోమని ఏడ్చింది. రైల్లోవున్న ప్రయాణీకులందరూ కిటికీల్లో నుంచి చూశారు.



పిల్ల వున్న స్థలం మీదనుండి రైలు వెళ్లి పోయింది. పట్టాలమధ్య పిల్ల బోర్లపడి ఏ చలనమూ లేకుండా పడుకుని వుండడం రైలులోని వాళ్లు చూశారు.

రైలు ఎంతో దూరం వెళ్లిపోయాక, ఆ పిల్ల తలపైకెత్తి, మోకాళ్ల మీదనుంచుని, కుక్కగొడుగులు ఏరుకుని, అక్కదగ్గరికి పరుగెత్తింది.





# ప్లమ్ గింజ


అమ్మ ప్లమ్‌పళ్లు కొని ఇంటికి తెచ్చి, అన్నం తిన్నాక పిల్లలకు ఇద్దామని పళ్లెంలో వుంచింది. వాన్య అంతకు ముందెన్నడు ప్లమ్‌పళ్లు తినలేదు. వాసన చూసి బాగున్నాయనుకున్నాడు. వాటిని రుచిచూడాలని వాన్యకి ఎంతగానో అనిపించింది. గదిలో ఎవ్వరూ లేకపోవడం చూసి, ఇక ఉండలేక, చప్పున ఓ పండు తీసుకుని తినేశాడు. భోజనానికి ముందు అమ్మ ప్లమ్‌పళ్లను లెక్కపెట్టింది - ఒక పండు తక్కువైంది. ఆమె వెళ్లి ఆ సంగతి భర్తతో చెప్పింది.

భోజనమప్పుడు నాన్న: "ఏమర్రా, పిల్లలూ! మీలో ఎవరైనా ఓ ప్లమ్‌పండు తిన్నారా ఏమిటి?" అని అడిగాడు. "అబ్బే మేం తినలేదే!" అన్నారు పిల్లలందరూ. గీసిన కందగడ్డలా వాన్య ముఖం ఎర్రబడింది. "అబ్బే, నేను తినలేదు!" అన్నాడు వాన్య కూడా.

అప్పుడు నాన్న అన్నాడు: "మీలో ఎవరో ఒకరు తినే వుండాలి, కాని మీరు తినలేదంటున్నారు. ఇదేమి బాగులేదు. అయితే, అసలు సంగతి ఏమిటంటే ప్లమ్‌పండులో గింజ వుంటుంది. గింజను వుమ్మేయకుండా, దానిని మింగేసినవాడు మాత్రం మరునాటికి చచ్చిపోతాడు. అందుకని నాకు బెంగగా వుంది."

వాన్య వెలవెలబోయి: "లేదు, నాన్న! గింజను కిటికీలోనుంచి వుమ్మేశాను, నాన్నా!" అన్నాడు. అందరూ ఫక్కున నవ్వారు. వాన్య భోరున ఏడ్చేశాడు.





# పక్షిపిల్ల

ఆరోజు సెర్యోష పుట్టినరోజు. సెర్యోషకి ఎన్నో కానుకలు – బొంగరాలూ, గుర్రబ్బొమ్మలూ, బొమ్మల పుస్తకాలూ, ఇంకా ఎన్నో వచ్చాయి. అన్నిటిలోకి మామయ్య ఇచ్చిన కానుక సెర్యోషకి బాగా నచ్చింది. అది పక్షులను పట్టే వల. ఆ వల ఓ చట్రానికి తగిలించి, దానికి చిన్న బల్లచెక్క అమర్చి వుంది. వల వెనక్కి మడిచేసి, బల్లచెక్కపైన గింజలు వుంచితే, పక్షి అందులో చిక్కుకుంటుంది. సెర్యోషకి భలే సరదా వేసింది. ఆ వలను తల్లికి చూపించడానికని ఇంట్లోకి పరుగెత్తాడు. తల్లి అంది:

"ఇది మంచి ఆటవస్తువు కాదురా. అయినా, నీకు పక్షిపిల్లలు దేనికిరా? వాటిని నువ్వెందుకు బాధపెట్టాల్రా?"

"వాటిని పట్టి, పంజరంలో పెడతానే, అమ్మా! అవి పాడతాయి, వాటికి తిండిపెట్టి పెంచుతానే!" అన్నాడు సెర్యోష.

సెర్యోష తల్లిని అడిగి గింజలు తెచ్చుకుని బల్లచెక్కపై వుంచి, వలను తోటలో వుంచాడు. పక్షిపిల్లలు వస్తాయేమో అని చూస్తూ సెర్యోష అక్కడే కూర్చున్నాడు. కాని పిట్టలు సెర్యోషని చూసి భయపడి, వల దగ్గర వాలలేదు. సెర్యోష అలానే కూర్చున్నాడు. ఇంతలోకి భోజనం వేళ అయింది. వల అలాగే వుంచేసి సెర్యోష ఇంట్లోకి వెళ్లాడు. భోజనం అయ్యాక సెర్యోష అక్కడికొచ్చి చూశాడు: వల మూసుకుపోయుంది, తళతళ మెరుస్తున్న పక్షిపిల్ల ఒకటి వలలో వుంది. సెర్యోషకి భలే సంతోషం వేసింది. పక్షిపిల్లను పట్టుకొని ఇంట్లోకి పరుగెత్తాడు.



"అమ్మా! నేను పట్టిన పక్షిపిల్లని చూడవే! ఇది కోకిలేనే, అమ్మా! చూడవే, ఎంత బాగా మెరిసిపోతోందో!"

తల్లి అంది: "ఇది జీనువాయి పిట్ట. దాన్ని అల్లరిపెట్టకు. దాన్ని వదిలిపెట్టేస్తే నయంరా!"

"అబ్బా వదిలిపెట్టనే! నేను దాన్ని పెంచుతాను. దానికి తిండిపెట్టి, నీళ్లు ఇస్తాను."

ఆ పక్షిపిల్లను సెర్యోష పంజరంలో పెట్టాడు. దానికి రెండురోజులు గింజలు పెట్టి నీళ్లు ఇచ్చాడు, పంజరం శుభ్రంచేశాడు. మూడోరోజుకి ఆ పక్షిపిల్ల వూసే మరచిపోయాడు. నీళ్లు మార్చలేదు. అప్పుడు తల్లి అంది:

"ఒరేయ్, చూశావా! నీ పక్షిపిల్ల మాటే మరచిపోయావు. ఇహ దాన్ని వదిలిపెట్టడమే మంచిదిరా!"

"అబ్బా, నేను వదిలిపెట్టను! మరిచిపోయాను, అంతే! ఇహనుంచి మరచిపోను. ఇప్పుడే వెళ్లి నీళ్లు మార్చి, పంజరం శుభ్రం చేస్తాను!" అన్నాడు సెర్యోష.

సెర్యోష పంజరంలోకి చేయి దూర్చి శుభ్రంచేయడం మొదలుపెట్టాడు. పక్షిపిల్ల భయపడిపోయి, రెక్కలు తపతప కొట్టుకుంటూ పంజరం చుట్టూ ఎగిరింది. పంజరం శుభ్రం చేసి, మంచినీళ్లు తెచ్చేందుకు వెళ్లాడు. సెర్యోష పంజరం తలుపు మూయడం మరచిపోయాడన్న సంగతి తల్లి చూసి, వాణ్ణి కేకేసింది:

"ఒరేయ్, సెర్యోష! పంజరం తలుపు మూసేయ్, లేకుంటే పక్షిపిల్ల పంజరంలోనుంచి ఎగిరిపోయి గదిలో దేనినైనా ఢీకొని చచ్చిపోతుంది."


అలా అని ఆమె ఇంకా అన్నదో లేనేలేదో, పక్షిపిల్ల తన రెక్కలను స్వేచ్ఛగా విప్పుకోవచ్చునని ఎంతో ఆనందించి, పంజరంలోనుంచి బయటికి వచ్చేసి, గదిలో ఎగిరి, కిటికీనుంచి పారిపోబోయింది. కాని, కిటికీకి వున్న అద్దాన్ని చూసుకోక, అద్దానికి గుద్దుకొని, కింద పడిపోయింది.

సెర్యోష మంచినీళ్లు తీసుకుని గదిలోకి వచ్చాడు. కిందవున్న పక్షిపిల్లను తీసి, పంజరంలో పెట్టాడు. పక్షిపిల్ల బతికే వుంది, కాని రెక్కలు చాపుకొని బోరగిలబడి, ఎగ రోజుకుంటోంది. సెర్యోష దానికేసి చూసి వలవల ఏడవడం మొదలుపెట్టాడు.

"అమ్మా! నేనిప్పుడు ఏమిటి చేయడమే?"

"ఇప్పుడేమీ చేయలేవు."

ఆ రోజంతా సెర్యోష ఆ పంజరం దగ్గరనుంచి కదల్లేదు. పక్షిపిల్లకేసి చూస్తూ కూచున్నాడు. పక్షిపిల్ల బోరగిలబడే వుంది, శ్వాస త్వరత్వరగా వస్తోంది. సెర్యోష నిద్రపోవడానికి వెళ్ళే ముందు చూశాడు: పక్షిపిల్ల ఇంకా బతికే వుంది. సెర్యోషకి చాలాసేపటి వరకు నిద్రపట్టలేదు. కన్ను మూతపడేసరికల్లా పక్షిపిల్ల అలా బోరగిలపడి ఎగవూపిరి తీయడమే కళ్ల ఎదుట కనబడేది. సెర్యోష ఉదయాన లేచి, పంజరం దగ్గరకెళ్ళి చూసేప్పటికల్లా పక్షిపిల్ల వెల్లకిలపడివుంది, కాలివేళ్ళు ముడుచుకుపోయున్నాయి, వొళ్ళు కట్టెబారిపోయుంది. ఆనాటినుంచి సెర్యోష ఇక ఎన్నడూ పక్షుల్ని పట్టలేదు.






# అబద్ధాలరాయుడు

కుర్రవాడొకడు గొర్రెలు కాస్తూ, తోడేలును చూసినట్టుగా: “తోడేలు, తోడేలు! రండి! బాబోయ్, రండి!” అని కేకవేశాడు. చుట్టుపక్కలున్న మనుషులు అక్కడికి పరుగెత్తుకుని వచ్చి చూశారు – తోడేలూ లేదు, ఏమీ లేదు. ఆ కుర్రవాడు ఇలా రెండు మూడు సార్లు చేశాడు. తర్వాత నిజంగానే తోడేలు అక్కడికి వచ్చింది. కుర్రవాడు అరిచాడు: “రండి, త్వరగా రండి! తోడేలు, తోడేలు!” ఎప్పటిలాగానే మళ్లీ ఈ సారి కూడా కుర్రవాడు మోసం చేస్తున్నాడని చుట్టుపక్కల మనుషులు ఆ కుర్రవాడి మాటలను పట్టించుకోలేదు. తోడేలు వచ్చి గొర్రెలను చంపేసింది.





# ఇద్దరు దోస్తులు




ఇద్దరు దోస్తులు అడవిపక్కనుండి వెళుతున్నారు. ఎలుగ్గొడ్డు ఒకటి వాళ్లకి ఎదురైంది. ఒకడు పరుగెత్తి చెట్టు ఎక్కాడు. రెండోవాడు ఒంటరిగా వుండిపోయాడు. ఏమి చేసేందుకూ లేక చప్పున కిందపడి చచ్చి పోయినట్టు నటించాడు.

ఎలుగ్గొడ్డు వాడి దగ్గరకు వచ్చి చుట్టూ వాసన చూసింది. వాడు ఊపిరి బిగబట్టుకున్నాడు.

ఎలుగ్గొడ్డు వాడి ముఖం వాసన చూసి చచ్చిన మనిషి అనుకుని అక్కడనుండి వెళ్లి పోయింది.

ఎలుగ్గొడ్డు వెళ్లిపోయాక, ఆ రెండవవాడు చెట్టు దిగి, నవ్వుతూ: "ఏమిరా! ఎలుగ్గొడ్డు నీ చెవిలో ఏదేనా రహస్యం చెప్పిందా ఏమిత్రా?" అని అడిగాడు.

"ఆపదలో అడ్డుపడేవాడే చుట్టం అని చెప్పిందిరా!"



# హంసలు


హంసల గుంపు ఒకటి శీతల ప్రాంతాలనుండి ఉష్ణ దేశాలకు ఎగిరి వెళుతోంది. అవి సముద్రంపై ఎగురుతూ వెళుతున్నాయి. అవి అలా పగలనక రాత్రి అనక, విశ్రాంతిలేకుండా ఎగిరి వెళుతున్నాయి. అది పున్నమి రాత్రి, పండువెన్నెల కాస్తోంది. ఆకాశాన ఎగురుతున్న హంసలు కిందనున్న జలాలను చూశాయి. రోజుల తరబడి ఎగురుతున్నాయేమో అవి అన్నీ అలసిపోయున్నాయి. ముందు వరసలో బలమైన పెద్ద హంసలున్నాయి. వెనక చిన్న పక్షులూ, బలహీనమైన పక్షులూ వున్నాయి. అన్నిటికంటే వెనక చిన్న హంస ఒకటి ఎగురుతోంది. దీని బలం అంతకంతకు తగ్గిపోయి, నీరసపడిపోతోంది. చివరకి అది ముందుకు ఎగరలేక రెక్కలు చాచి, కిందకి పడిపోసాగింది. అది క్షణక్షణానికి నీటికి మరింత దగ్గరగా వచ్చేస్తోంది, క్షణక్షణానికీ దాని నేస్తులు మరింత దూరంగా పండు వెన్నెలలోకి ఎగిరిపోతున్నారు. ఆ హంస నీటిమీద వాలి, రెక్కలు ముడుచేసుకుంది. దాని శరీరంకింద సముద్రజలాలు కదిలి, దానిని ఇటూ అటూ వూపాయి. నీటిపైన తేలుతున్న హంసకి, ఆకాశాన ఎగిరిపోతున్న హంసల గుంపు పిండి ఆరబోసినట్లున్న వెన్నెలలో తెల్లని చుక్కల్లా కనబడ్డాయి. తరువాత వాటి రెక్కల చప్పుడు నిశ్శబ్దంలో వినబడింది. అవి పూర్తిగా అదృశ్యమైపోయిన తరువాత, నీటిపైన వున్న హంస మెడ వెనక్కి వాల్చి కళ్లు మూసుకుంది. అది రవంతైనా కదలలేదు. సముద్రం మాత్రమే వెడల్పు చారలలో పైకిలేస్తూ కిందకు దిగుతూ తనతో కూడా దానిని పైకీ కిందకూ ఊపుతోంది. తెల్లవారే ముందు సన్నని పిల్లగాలి సముద్రాన్ని మెల్లగా తాకింది. హంస కళ్లు విప్పింది. తూర్పున పొద్దు పొడుస్తోంది. చంద్రుడూ, నక్షత్రాలూ వెలవెల బోతున్నాయి. హంస నిట్టూర్చింది. మెడ పొడుగ్గా చాచి, రెక్కలు తపతపలాడించి ఎగిరింది. ఎత్తుకి, ఇంకా ఎంతో ఎత్తుకి ఎగిరి ఉష్ణదేశాలున్న వైపుకి ఎగిరిపోతోంది. తన నేస్తులు వెళ్లిన చోటుకి అది ఒంటరిగా ఎగిరిపోతోంది.



# ఏనుగు

ఒక భారతీయుని దగ్గర ఒక ఏనుగు ఉండేది. యజమాని దానికి సరిగా తిండిపెట్టకుండా దానితో బోలెడంత పనిచేయిస్తూ వుండేవాడు. ఒకనాడు ఏనుగుకు పట్టరాని కోపంవచ్చి, యజమానిని కాలికింద వేసి తొక్కేసింది. యజమాని చచ్చిపోయాడు. అది చూసి అతని భార్య భోరున ఏడ్చి, తన పిల్లల్ని ఏనుగు దగ్గరకు తీసుకొని వచ్చి, దాని కాళ్ల కింద పడేసి అంది: “ఓ ఏనుగా! ఈ పిల్లల తండ్రిని చంపనేచంపావు, వీళ్లను కూడా చంపేయ్!” పిల్లలకేసి చూసి, వాళ్లందరిలోనూ పెద్దవాణ్ణి తన తొండంతో పైకెత్తి, తన కుంభస్థలంమీద కూచోబెట్టుకుంది ఏనుగు. ఆనాటినుంచి, ఏనుగు ఆ పిల్లవాడు చెప్పినట్టు విని, ఆ కుటుంబంకోసం ఎంతో విశ్వాసంతో పనిచేసింది.







# పిచ్చుక, వానకోయిల

ఒకనాడు నేను ముంగిట్లోకి వచ్చి, వాన కోయిలలు చూరుకింద కట్టిన గూటివైపు చూస్తూ నుంచున్నాను. వాన కోయిలలు రెండూ నా ఎదుట నుంచి ఎగిరి వెళ్లిపోయాయి. గూడు ఖాళీగా వుంది.

ఆ సమయంలో ఒక పిచ్చుక ఎగిరివచ్చి, గూడు నలుమూలలా పరికించి, లోపలికి దూరింది. తరువాత తన తలను గూట్లో నుండి బయటికి పెట్టి కిచకిచలాడింది.

మరి కాస్సేపటికి వానకోయిల ఆ గూటి దగ్గర వాలి, గూట్లోకి తొంగి చూసింది. గూటిలో వున్న అతిథిని చూసి కీచుకీచుమని కూతపెట్టి, అక్కడ నుంచుని, రెక్కలు ఆడించింది. మరుక్షణం ఎగిరి వెళ్లిపోయింది.

పిచ్చుక గూట్లో కూర్చుని కిచకిచమంటూ అరిచింది.

వానకోయిల గుంపు ఒకటి తటాలున అక్కడికి వచ్చింది. పిచ్చుకను చూడ్డానికా అన్నట్టు ఆ వానకోయిలలు గూటిలోకి చూసి, మళ్లీ ఎగిరిపోయాయి.



పిచ్చుక భయపడనే లేదు. అది తన తల గూట్లోంచి బయటపెట్టి కిచకిచమంటూ అరుస్తూనే వుందీ.

వానకోయిలలు మళ్లీ గూటి దగ్గరకి వచ్చాయి. ఏమిటో చేసి, మళ్లీ వెళ్లిపోయాయి.

వానకోయిలలు వూరకనే అక్కడకు ఎగిరి రాలేదు: ప్రతి ఒక్కటీ కొంత మట్టి ముద్ద తీసుకువచ్చి, కొద్ది కొద్దిగా గూటి కన్నానికి పూయడం మొదలుపెట్టాయి.

అలా ఎన్నోసార్లు తిరుగుతూ ఎంతో సేపు పనిచేశాయి. గూటి ద్వారం అంతకంతకు మరింత చిన్నదైపోతోంది.

గూటిలో వున్న పిచ్చుక మెడ మొదట్లో కనపడింది. తరువాత ముక్కు మాత్రమే కనపడింది. ఆ తర్వాత మరేమి కనపడలేదు. పిచ్చుక వున్న గూటి ద్వారాన్ని వానకోయిలలు మట్టితో సాంతం పూడ్చేశాయి. అప్పుడు ఆ వానకోయిలలు ఈలలు వేస్తూ ఇంటిచుట్టూ గుండ్రంగా తిరిగాయి.



# గద్ద

ఒక గద్ద సముద్రానికి అతి దూరంగా వున్న ఒక రోడ్డుపక్కనున్న పెద్ద చెట్టుపైన గూడు కట్టి, అందులో పిల్లలను పెంచుతోంది.

ఒకసారి కొందరు మనుషులు ఆ చెట్టుపక్కన పనిచేస్తున్నారు. గద్ద ఒక పెద్దచేపను గోళ్లతో పట్టుకుని, గూటిదగ్గరికి వస్తోంది. మనుషులు చేపను చూసి, చెట్టు చుట్టూ మూగి, కేకలూ, బొబ్బలూ పెడుతూ గద్దమీదకు రాళ్లు విసరడం మొదలుపెట్టారు.

గద్ద చేపను జారవిడిచేసింది. మనుషులు ఆ చేపను పట్టుకుని అక్కడనుండి వెళ్లిపోయారు.

గద్ద గూడు చేరి, అంచుపైన నుంచుంది. గద్ద పిల్లలు తలలు పైకెత్తి కిచకిచ అరిచి తిండిపెట్టమని తల్లిని బతిమాలుకున్నాయి.

గద్ద అలిసిపోయి ఉండడంతో సముద్రానికి మళ్లీ వెళ్లలేక పోయింది. గూట్లోకి వెళ్లి, తన రెక్కలను పిల్లలపైన చాపి, వాటిని ముద్దులాడి, ఆలస్యమైనప్పటికీ మరికాస్సేపు అవి ఓపిక పట్టి వుండాలని వాటిని బతిమాలుకున్నట్టుగా వాటి ఈకలను సరిదిద్దింది. కాని పిల్లలను అది ముద్దులాడిన కొద్దీ అవి తిండికోసం మరింత గట్టిగా అరిచాయి.

అప్పుడు గద్ద తన పిల్లల దగ్గరనుండి ఎగిరి చిటారుకొమ్మపైన వాలింది.

గద్ద పిల్లలు ఈలులు వేసినట్టుగా కీచుకీచుమని కూతలు పెడుతూ, మరింత దీనంగా మొరపెట్టాయి.

అప్పుడు గద్ద తటాలున బిగ్గరగా కూతపెట్టి, రెక్కలు ఆడిస్తూ సముద్రపు దిశగా ఎంతోకష్టంతో ఎగిరింది.

గద్ద సాయంకాలం చాలా ఆలస్యంగా మరొక పెద్ద చేపను గోళ్లతో పట్టుకొని తిరిగివచ్చింది.

చెట్టు దిశగా ఎగిరి వస్తూ, మనుషులు మళ్లీ అక్కడ వున్నారేమో అని అది జాగ్రత్తగా చూసింది. మనుషులు లేకపోవడం చూసి, రెక్కలు ముడుచుకుని గూటి అంచున వాలింది.

గద్ద పిల్లలు తలలు పైకెత్తి నోళ్లు తెరిచాయి. గద్ద తను తెచ్చిన చేపను తుంపులుచేసి పిల్లలకు పెట్టింది.





# సొరచేప

మా నౌక ఆఫ్రికా తీరాన లంగరు వేసి వుంది. సముద్రం మీద నుండి చల్లని గాలి వీస్తూ పగటిపూట ఎంతో బాగుంది. కాని సాయంకాలానికి వాతావరణం మారిపోయింది: ఉక్కగా వుండి మండుతూన్న పొయ్యి గూటిలోనుంచే వచ్చాయా అన్నట్టు సహారా ఎడారినుంచి వేడిగాడ్పులు మొదలయ్యాయి.

సూర్యాస్తమయం ముందు కెప్టెను డెక్కుమీదకి వచ్చి: "స్నానం చెయ్యండి!" అని కేకవేశాడు. నావికులు చెంగున నీటిలోకి ఉరికి తెరచాపను నీటిలోకి దించి, దాని కొసలు నావకు కట్టి ఒక 'ఈత కొలను' మాదిరిగా ఏర్పాటు చేశారు.

నౌకలో మాతో ఇద్దరు కుర్రవాళ్లున్నారు. తెరచాప కొలను వాళ్లకి ఇరుకుగా అనిపించి బారుగా వున్న సముద్రంలోకి పందెం వేసుకొని ఈతకొట్టుకుంటూ వెళితే బాగుంటుందనుకున్నారు. లంగరు దించిన చోట తేలుతున్న పీపా దగ్గరకు ఎవరు ముందు ఈదగలుగుతారో అని పందెం వేసుకున్నారు.

ఓ కుర్రాడు తన నేస్తుణ్ణి దాటిపోయాడు, కాని మరికాస్సేపటికి వెనకబడిపోయాడు. ఈ కుర్రవాడి తండ్రి ముసలి ఆర్టిలరీ నావికుడు – డెక్కుమీద నుంచుని, తన కొడుకువైపు ముద్దుగా చూస్తున్నాడు. కొడుకు వెనక పడిపోతుండడం చూసి తండ్రి: "వెనక్కి పడకు! ముందుకు వేయ్ బార!" అంటూ బొబ్బరించాడు.

డెక్కుమీదనుండి ఎవరో తటాలున కేకవేశారు: "సొరచేప!" మేమందరమూ ఆ కేక విని ఆ సముద్రపు వింతను చూశాం.

సొరచేప ఆ కుర్రవాళ్లకేసి సరాసరి దూసుకుని వెళుతోంది.

"సొరచేప! వెనక్కి వచ్చేయండి, వెనక్కి వచ్చేయండి!" అని ముసలి ఆర్టిలరీ నావికుడు గావుకేకలు పెట్టాడు. కాని కుర్రవాళ్లకి అతని కేకలు వినబడక, వాళ్లు పందెం మొదలుపెట్టినప్పటికంటే మరింత సరదాగానూ, గట్టిగానూ నవ్వుతూ ముందుకు ఈదుకుపోయారు.

ముసలి ఆర్టిలరీ నావికుని ముఖం పాలవలె తెల్లబారింది. మనిషి నిశ్చేష్టితుడై కుర్రవాళ్లవైపు చూశాడు.

నావికులు పడవను నీట్లోకి దించి, దానిలోకి చప్పున ఉరికారు. తమ బలం కొద్దీ తెడ్లువేసి దానిని కుర్రవాళ్ల దగ్గరకు తీసుకెళుతున్నారు. కుర్రవాళ్లకీ సొరచేపకీ ఇరవై అంగలకంటే ఎక్కువ దూరం వుండదు. కాని అప్పటికి పడవ కుర్రవాళ్లకి ఎంతో వెనుకనుంది.



వాళ్లను పిలుస్తూ వేస్తున్న కేకలను మొదట్లో వినిపించుకోలేదు, వాళ్లు సొరచేపనూ చూడలేదు. కాని తర్వాత ఒక కుర్రవాడు దానిని చూశాడు. ఆ కుర్రవాడి నోటినుండి కెవ్వుమంటూ వచ్చిన కేకను మేమందరం విన్నాం. ఇహ కుర్రవాళ్లు మరొక దిశగా ఈదసాగారు.

ఆ కేక ఆర్టిలరీ నావికుణ్ణి మేల్కొలిపినట్టు పనిచేసింది. తను ఉన్న చోటనుండి అతడు చెంగున లేచి, ఫిరంగి దగ్గరకు పరుగెత్తాడు. ఫిరంగి మూతిని గిర్రున తిప్పి గురి చూసి జానకితాడును ఫిరంగికి ముట్టించాడు.

నౌకలో ఉన్న అందరమూ భయంతో గడ్డకట్టుకుపోయాం. ఏమి జరగబోతోందో అని నిరీక్షించాం.

ఫిరంగి గుండు ధణేలుమని ధ్వనించింది. ఆర్టిలరీ నావికుడు ఫిరంగి పక్కన పడి రెండు చేతులతోనూ ముఖం కప్పేసుకున్నాడు. సరిగ్గా ఆ క్షణంలో ఫిరంగిపొగ లేవడంతో సొరచేపకి ఏమైందో, కుర్రవాళ్లకి ఏమైందో చూడలేకపోయాం.

పొగ నీటివైపు చెదిరిపోయి అన్ని దిశలనుండి ఒక మూలుగు మొదట వినబడింది, తర్వాత ఆ మూలుగు మరింత బలం పుంజుకుంది. చివరకు సంతోషభరితమైన కేక ఒకటి వినిపించింది.

ముసలి ఆర్టిలరీ నావికుడు తన ముఖంమీద నుంచి చేతులు తీసివేసుకుని తలెత్తి సముద్రంవైపు చూశాడు. కొన ప్రాణంతో వున్న సొరచేప పసుప్పచ్చని పొట్ట కెరటాల పైన కిందకీ మీదకీ ఊగుతోంది. మరికొంతసేపటికి, పడవ కుర్రవాళ్లవైపు వెళ్లి వాళ్లని ఎక్కించుకుని నౌకమీదకి చేర్చింది.





# గంతు

ఒక నౌక ప్రపంచం చుట్టూ ప్రయాణించేసి స్వదేశం చేరుకుంటోంది. వాతావరణం ప్రశాంతంగా వుంది. నౌకలో వున్నవారందరూ డెక్కుమీద వున్నారు. జనం మధ్యన ఓ పెద్ద కోతి గిరగిర తిరుగుతోంది. అది అందరినీ వినోదపరుస్తోంది. అది ముఖం వికృతంగా పెట్టుకుని వెక్కిరిస్తోంది, గంతులేస్తోంది, నవ్వుపుట్టించేటట్టు వికారపు చేష్టలు చేస్తోంది. తను అందరికీ వినోదం కలిగిస్తున్న సంగతి ఆ కోతి ఎరిగినట్టూ, అందుకని అది మరింతగా వొళ్లు మరచి ఆటలాడుతున్నట్టూ అనిపించింది.

ఆ జనంలో పన్నెండేళ్ల కుర్రవాడొకడున్నాడు. ఆ కుర్రవాడు నౌక కెప్టెన్ కొడుకు. కోతి చెంగున గంతువేసి కుర్రవాడి తలమీద టోపీని లాక్కుని చకచక ధ్వజస్తంభం పైకి ఎక్కింది. అందరూ ఫక్కున నవ్వారు. కుర్రవాడు టోపీ లేకుండా నుంచున్నాడేమో, తను నవ్వాలో ఏడవాలో తెలిసిందికాదు.

కోతి ధ్వజస్తంభం మొదటి అడ్డుకర్రమీద కూచుని, టోపీని పళ్లతోనూ గోళ్లతోనూ పీకడం మొదలుపెట్టింది. అది కుర్రవాడికేసి వేలు చూపించి వెక్కిరించింది. కుర్రవాడు తన పిడికిటిని దానివైపు ఝుళిపించాడు, దానిమీద కేకలేశాడు. కాని అది టోపీని మరింత జోరుగా పీకేస్తోంది. నావికులు విరగబడి నవ్వారు, కుర్రవాడి ముఖం జేవురించింది. కుర్రవాడు తను తొడుక్కున్న కోటును తీసేసి, దానిని అడ్డుదూలంపైన కూచున్న కోతిమీదకి విసిరేశాడు. మరునిమిషం ధ్వజస్తంభం నుండి వేలాడుతున్న తాడు పట్టుకుని అడ్డుకర్రమీదకి ఎక్కాడు. టోపీని కోతిచేతిలోనుంచి లాగివేద్దామని కుర్రవాడు అనుకున్న క్షణంలో, అది మరింత చురుకుగానూ మరింత త్వరగానూ ఇంకా పైకి ఎక్కింది.

"నాకు దొరక్కుండా నువ్వెక్కడికి పోతావే!" అని కుర్రవాడు కేకేసి, తను కూడా పైకి ఎక్కాడు.

కోతి మరొకసారి కుర్రవాడికి దొరకకుండా తప్పించుకుని, ఇంకా పైకి ఎక్కింది. కుర్రవాడు అక్కడితో ఆగకుండా, మరింత ఉత్సాహం ప్రదర్శించి తను కూడా ఇంకా పైకి ఎక్కాడు. ఆ విధంగా కోతీ, కుర్రవాడూ ఇద్దరూ కూడా ఏకసమయానికే ధ్వజస్తంభం శిఖరం చేరుకున్నారు. కోతి ధ్వజస్తంభం శిఖరంనుండి బారుగా సాగి, తన కాళ్లతో తాడు పట్టుకొని, టోపీని చిట్టచివరి అడ్డుకర్రకొనకు తగిలించేసింది. తను శిఖరంమీదకి ఎక్కి, అక్కడ ముఖం వికారంగా పెట్టుకుని, పళ్లు ఇకిలిస్తూ వినోదకరంగా కూచుంది. టోపీ వేలాడుతూన్న అడ్డుకర్ర కొనకూ, ధ్వజస్తంభం శిఖరానికీ నాలుగున్నర అడుగుల దూరం వుంటుంది. కాని స్తంభాన్నీ, తాడునీ పట్టు నుండి వదిలిపెట్టకుండా టోపీని అందుకోవడం మాత్రం అసాధ్యం.

కాని కుర్రవాడికి భలే ఉద్రేకం వచ్చేసింది. స్తంభాన్ని వదిలిపెట్టేసి, అడ్డుకర్రమీద కాలుపెట్టాడు.

డెక్కుమీద వున్నవారందరూ కోతీ, కెప్టెను కొడుకూ ముందుముందు ఇంకా ఏ తమాషాలు చేయబోతారో అని నవ్వుకుంటున్నారు. కాని కుర్రవాడు తాడు వదిలేసి చేతులు వూపుకుంటూ అడ్డుకర్రపైన అడుగు పెట్టేసరికి, అందరూ హడలిపోయి గడ్డకట్టుకు పోయారు.

కుర్రవాడి అడుగు రవంత తొట్రుకుందంటే, ఇంకేముంది, ఆ ఎత్తునుండి డెక్కుమీద పడి, వొళ్లు ఎక్కడికక్కడ ముక్కచెక్కలై, మనిషి చచ్చి వూరుకుంటాడు. పోనీ, తొట్రుకోకుండా అడ్డుకర్ర చిట్టచివర వరకూ వెళ్లగలిగి టోపీ అందుకున్నప్పటికీ కూడా, ధ్వజస్తంభాన్ని మళ్లీ అందుకోవడం కుర్రవాడికి కష్టమే అవుతుంది.



ఏమి జరగబోతుందో అని అందరూ కుర్రవాడివైపు మౌనంగా చూస్తున్నారు.

అక్కడున్నవారిలో ఎవరో గాని భయంతో కెవ్వుమని కేకవేశారు.

ఈ కేక చెవినిబడడంతో కుర్రవాడు మనసు కూడదీసుకుని కిందకి చూసి తటపటాయించాడు.

సరిగా ఆ వేళకే, నౌక కెప్టెను – ఆ కుర్రవాడి తండ్రి – తన కేబిన్‌నుండి డెక్కుమీద ప్రత్యక్షమయాడు. సముద్రపు కాకులను వేటాడటానికని అతడు తుపాకి పట్టుకుని వచ్చాడు. కొడుకు ధ్వజస్తంభంపైన వుండడం చూశాడు. వెంటనే తుపాకితో కొడుకుని గురిచూసి, కేకవేశాడు:

"నీట్లోకి! వెంటనే గంతువేయ్ నీట్లోకి! తుపాకి పేలుస్తున్నాను!"

కుర్రవాడికి బోధపడక తటపటాయించాడు.

"గంతువేయ్, లేకుంటే తుపాకి పేలుస్తా! ఒకటి.... రెండూ...."

తండ్రి "మూడు" అనే సరికి – కుర్రవాడు తలకాయను కిందకు ఒక్క ఊపు ఊపి, గంతువేశాడు.

కుర్రవాడి శరీరం ఫిరంగి గుండులా చెళ్లున సముద్రంపై పడింది. కెరటాలు కుర్రవాణ్ణి పొట్టబెట్టుకునే లోపల, ఇరవైమంది యువ నావికులు నౌకలోనుంచి సముద్రంలోకి ఉరికారు. నలభై సెకెండ్లు గడిచాయి– ఆ నలభై సెకెండ్లూ ఒక యుగం అనిపించింది అక్కడున్నవారందరికీ. అప్పుడు కుర్రవాడు నీటిపైకి తేలాడు. సరిగా ఆ సమయానికి నావికులు కుర్రవాణ్ణి చప్పున పట్టుకుని, నౌకమీదకి చేర్చారు. మరికొద్ది నిమిషాలకి కుర్రవాడి నోట్లో నుంచీ, ముక్కులోంచి నీళ్లు వచ్చేశాయి, ఇక ఊపిరితీయడం మొదలుపెట్టాడు.

కెప్టెను కొడుకును చూసి, తన మనసుకు ఏదో తట్టినట్టు, తటాలున కేకవేశాడు. తన ఏడుపు ఎవ్వరికీ కనబడకుండా వుండేందుకని పరుగెత్తి తన కేబిన్‌లోకి వెళ్లిపోయాడు.

# సింహం, చిన్నకుక్క


ఒకసారి లండన్‌లో అడవి జంతువులను ప్రదర్శించారు. ప్రదర్శనానికి రుసుముగా ప్రేక్షకులనుండి డబ్బు తీసుకున్నారు, లేదా జంతువులకు ఆహారం కోసమని కుక్కలనూ, పిల్లులనూ తీసుకురమ్మన్నారు.

ఒక మనిషి ఆ అడవి జంతువులను చూడాలనుకున్నాడు. వీధిలో తనకు కనపడిన ఒక చిన్న కుక్కను పట్టుకుని మృగశాలకి వెళ్లాడు. మృగశాల సేవకులు అతణ్ణి లోపలకు వెళ్లనిచ్చారు, సింహానికి ఆహారంగా ఆ చిన్నకుక్కను బోనులో పడేశారు.

ఆ కుక్క తోక ముడుచుకుని బోనులో ఓ మూల నక్కిపోయింది. సింహం దాని దగ్గరకు వెళ్లి వాసన చూసింది. కుక్క వెల్లకిల పడుకుని, పంజాలు పైకెత్తి తోక ఆడించింది. సింహం తన పంజాతో కుక్కను తాకి, దానిని పక్కకు వొత్తిగిలించి, నిలబెట్టించబోయింది. కుక్క చెంగున లేచి తన వెనకకాళ్లమీద సింహం ఎదుట కూచుంది. సింహం కుక్కను నిదానంగా చూసి, శిరస్సు ఇటూ అటూ ఆడించిందే కాని, దానిని ముట్టుకోనైనా ముట్టుకోలేదు.

మృగశాల యజమాని అక్కడకు వచ్చి, సింహం కోసమని పెద్ద మాంసపు ముక్కను బోనులో వేసేసరికి, సింహం ఆ మాంసపు ముక్కను చీరి, ఓ ముక్కను కుక్కముందు వుంచింది. సాయంకాలం సింహం పడుకోగా, కుక్క దాని పక్కన చేరి తలను సింహం పంజాపైన పెట్టుకుని నిద్రపోయింది. కుక్క సింహంతో కలిసి బోనులోనే వుంటూండేది. సింహం దానిని ముట్టుకునేది కాదు. తన ఆహారం తను తినేది, తనజాగాలో తను పడుకునేది, అప్పుడుప్పుడు కుక్కతో ఆడుకునేది. ఇలా కొన్నాళ్లు గడిచింది.

ఒకనాడు ఓ వ్యక్తి మృగశాలకు వచ్చి సింహాన్ని చూసినప్పుడు, చిన్నకుక్కను పోల్చుకున్నాడు. ఆ చిన్నకుక్క తనదని అతడు మృగశాల యజమానితో చెప్పి, దానిని తనకు ఇవ్వమని కోరాడు. మృగశాల యజమాని అందుకు ఒప్పుకున్నాడు. కాని దానిని బోనులోనుంచి బయటికి తీసేందుకని అతడు బోనుదగ్గరకు వెళ్లాడో లేదో, సింహం రౌద్రమైపోయి గుర్రుమంది.



సింహమూ చిన్నకుక్క రెండూ కలిసి ఒకే బోనులో ఉండేవి. ఆ విధంగా ఒక ఏడాది గడచిపోయింది. ఆ తరువాత కుక్కకి జబ్బుచేసి చచ్చిపోయింది. సింహం తిండితినడం మానివేసింది. చిన్నకుక్కను వాసన చూసింది, నాకింది, దాన్ని పంజాతో తాకింది. కుక్క చచ్చిపోయిందని సింహం తెలుసుకుని అది తటాలున ఒక్క ఎగురు ఎగిరింది, వెంట్రుకలు నిక్కబొడుచుకుంది, తోకను ఒకపక్కనుండి ఒక పక్కకు రివ్వురివ్వున ఆడించి, తోకతో చెళ్ళున కొట్టుకుంది. బోనుగోడలపైన విరుచుకుపడింది. బోను చువ్వలనూ, నేలనూ కొరకడం మొదలెట్టింది.

ఆ రోజంతా అది బోనును బాదుతూ, ఇటూ అటూ తిరుగుతూ గర్జిస్తూనే వుంది. తరువాత, చచ్చిపోయిన కుక్క పక్కనే పడుకుని స్థిమితపడింది. చచ్చిన కుక్కని బోనులోనుంచి ఎలాగైనా తీసివేయాలని అనుకున్నాడు మృగశాల యజమాని, కాని దాని దగ్గరకు సింహం ఎవ్వరినీ రానివ్వలేదు.

మరొక చిన్నకుక్కను సింహానికి ఇస్తే అది తన దుఃఖాన్ని మరచిపోతుందని యజమాని అనుకుని, మంచి చురుకైన ఒక చిన్నకుక్కను బోనులోకి వదిలాడు. కాని సింహం దానిని చూసీచూడడంతో ముక్కలముక్కలకింద చీరిపారేసింది. మరి కాస్సేపటికి సింహం చచ్చిపోయిన కుక్క పిల్లను తన పంజాలతో కౌగిలించుకుని, ఐదురోజులు అలా పడుకుంది.

ఆరవ రోజున సింహం చచ్చిపోయింది.

# విషయసూచిక

రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్ (1828-1910)
బాలలకోసం అనేక కథలు రాశాడు.
ఈ కథలు విశ్వసాహిత్యంలో ఆదరణ పొందాయి.

ఈ సంపుటిలో
లియో టాల్‌స్టాయ్ రాసిన
ఉత్తమ కథలు కొన్ని పొందుపరచాం.
సుప్రసిద్ధ చిత్రకారుడు ఎ. పహోమొవ్
ఈ కథలకు బొమ్మలు వేశాడు.